# సైన్యం

జ్వాలాముఖి

"ఎల్లిరాయే తల్లి ఎల్లిరా — ఎందు 'కేడు స్తావే ఎర్రి మొగవా(—అత్తోరింటి కెల్తున్నావా( యేటి—మా బతుకుల్ని బంగారం చేయడాని కెళ్తున్నాయే తల్లి—గుడిశల్లో గునుస్తూన్న పానాలకి సంజీవిని తేవడానికెళ్తున్నావే పిచ్చిపిల్ల. ఈ రోగాల గూడానికి అమృతం తెస్తావే."

అందరూ ఓదారుస్తున్నారు. ధైర్యం ఇస్తున్నారు. వెళ్ళిపొమ్మంటున్నారు. తనను మాత్రం గుడిశల్ని వదలి వుండ లేని మమకారం వేధిస్తూ వుంది. తను దూరమైతే ఈ దిక్కూ మొక్కూ లేని పసి వాళ్ళని కనిపెట్టేదెవరు? అవును తాను కూడా వెళ్ళడానికి సిద్ధపడింది ఎవరి కోసం? ఈ దుఃఖితులకోసమే—ఆరేడేళ్ళ ప్రవాస జీవితం—అయినా వెళ్ళక తప్పదు. చీకటి తలుపులు తెరవాలి.

"ఏందే వెర్రి మొగవా? అలా నిలబడి పోనావేంటి? పరధ్యాన్నం వస్తే బతుక్కి పెమాదం! అసలే ఆడపిల్లవి. అప్పై మొఖం చెల్లదు. దానికి తోడు జాలి గుండె. అందుకు తగ్గట్టు తెగని ఆలోశన్లు, ఇట్టాగైతే కష్టమే తల్లి. బేగు నడు బండి టైం అయింది."

పొంగివస్తూన్న దుఃఖాన్ని సముద్ర మంతటి గూడెం ప్రేమలో ఎలా తమాయించుకోవాలో తోచడంలేదు తనకు. వీళ్ళ ప్రేమలు తనని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఒకొక్కరూ ఒక్కొక్క వస్తువు చొప్పున తెచ్చిస్తున్నారు, హెచ్చరిస్తున్నారు. ఆపాద మస్తకం తాను కదిలిపోతూ వుంది. చలికాలంకోసం ఒకరు గొంగళి తెచ్చిస్తే మరొకరు చెప్పులు కుట్టుకొచ్చారు. కాదన లేని సమిష్టి కృషి—అందుకే తను వెళ్ళక తప్పదు.

"ఇంకా రంగడు రాలేదా(? బండి టైం అయిపోతా వుంది. అదిగదిగో వస్తు న్నాడు — వాడికెన్ని యూనియను గొడవలు."

రిక్షాను సింగారించుకొని రంగడు రానే వచ్చాడు. రావటంతోటే పెట్టా వగైరా రిక్షా ఎక్కించేశాడు. కూచోమని సీటును చరిచాడు. తాను కూచుంది. జోగులు తాత ఆఖరి సారిగా హెచ్చరికలు చేస్తున్నాడు. గూడానికి గూడెం అభయ హస్తం ఎత్తి జేజేలు టాటాలు పలుకు తూంది.

గూడెం వారి అభయహస్తాల జ్ఞాపకాల కోసం తను భద్రపరచుకొన్న డైరీని అందులోని చిన్నారి చేతుల అద్దకాల్ని ఒక్కసారి వెదకి చూసుకొంది. తీరా


పెజీలు తిప్పేసరిక దృష్టిని ముంచళాయి పెల్లుబికిన ప్రేమ కన్నీళ్ళు. అనీ సర్దుకుంది. రిక్షా జోరుగా పోతోంది. రంగడు ఎంత హుషారుగా సాగనంపవచ్చాడు. అతనే కాకుంటే తనకీ చదువు సాధ్యమయ్యేది కాదు. ఎలా తన చదువును గూడెం ఉద్యమంగా మార్చాడు. రిక్షా యూనియన్, సోడాబండ్లు, కిల్లీకొట్లు. పల్లీకాయల వాళ్ళు తనకు చదువు చెప్పించడానికి ఎలా ముందుకొచ్చారు. రంగడే లేకుంటే గూడానికే చిరునామా వుండేది కాదు. అందరి బాధ రంగడిబాధ. ఆదర్శాల జీవి. అతనంటే తనకిష్టమే కాని అతనికి తీరికెక్కడిది? అస్తమానం లోకం మరమ్మత్తు.

"ఏం సుజాతా! మళ్ళీ కలల్లోకి వెళ్ళావా? టైం లేదు స్టేషన్ వచ్చేసింది" అనడం ఆలస్యం, సుజాత రిక్షా దూకినట్లుగా దిగేసింది. అప్పటికే రంగడివాళ్ళు రైల్లో సీటు సంపాదించి ఎదురు చూస్తున్నారు. అంతా తలా ఒక మూటా పెట్టా మోసుకెళ్ళి రైల్లో పడేశారు. క్రిక్కిరిసిన జనం నుండి ఈదుకుంటూ వెళ్ళి సీటులో కూచో గలిగింది సుజాత. రైలు కదిలింది. రంగడి ముఖాన్ని చూద్దామన్నా కిటికీదాకా వెళ్ళేట్లులేదు. ఒకటే రద్దీ. ఎలాగో రంగడందించిన కొత్తపుస్తకం'అమ్మ' అందుకోగలిగింది. అందుకుంటూ అతని ఆకాశమంత ఆత్మను అరచేతుల్లో చూసి తట్టింది తన్మయత్వంలో. రంగడి చేయి బయటికి వెళ్ళిపోయింది. పుస్తకం తన చేపల్లో మిగిలిపోయింది. వినిపించి వినిపించనట్లు రంగడి హెచ్చరికలు వినవస్తున్నాయి. రైలు వేగం అందుకుంది.

మళ్ళీ సుజాత తనలోకి వచ్చేసింది. గూడెంలోని గుడిశ గుడిశ, గురించి ఆలోచించసాగింది. చూలాలు లక్ష్మక్క ఎలా పురుడు పోసుకుంటోందో ఏమో! బాలెంత పద్మక్క ఆరోగ్యమేంకాను. తాను లేకుంటే జోగుల్తాత ఎలావుంటాడు. మధ్యరాత్రి కొచ్చినా రంగడి కన్నం పెట్టేదెవరు? గూడెంవారి పసివాళ్ళకు చందమామ కథలు చెప్పే దెవరు? రంగ డొక్కడు ఎన్నని చూస్తాడు గూడెంలో.

గూడాన్ని తలలో మోస్తూన్న సుజాతను "ఏయ్ నిన్నే — టికెట్టు వుందా లేదా? ఏమిటా పరాకు?" "సారీ ఇదిగో అండీ" అని అందించిన టికెట్టును తీసుకొని టీసీ చెక్కింగు గుర్తుగా గుండె గుర్తు వేసి అడ్డంగా బాణం గీశాడు కొంటెగా. అది చూసుకున్న సుజాత ఏమి తోచక అలాగే వుండిపోయింది. చుట్టూ చూసింది. నిద్రిస్తున్న వాళ్ళు నిద్రను నటిస్తున్న వాళ్ళు తనని ఆపాదమస్తకం తూకం వేస్తున్న వాళ్ళు. నిల్చున్న వాడొకడు తూలి సరిగ్గా పైనే పడ్డాడు. "ఆడాళ్లున్న సంగతి తెలీదా— అలా పైబడితే ఎలా?" అని తన పక్కావిడ ముదురుగా హెచ్చరించింది. "కిందబడ్డానికి చోటేదీ! ఇంతకూ నీకేటిదమ్మా నీపైబడ్లేదుగా" అనేసరికి ఆమె రుసరుసమంటూ సుజాతను చూసింది. తనేం చెయ్యగలదు? రైల్వే వాళ్ళకు డబ్బులు కావాలి? పోరంబోకులకు కుషీ కావాలి! ఇలాంటి బాపతే తన గూడాని కొచ్చి వయసు వెళ్ళగక్కలేదు? పాపం సావి

వానొచ్చి వరదలాయె!?



త్రక్క ఏలా రోగాలతో మూల్గుతూంది? సీతక్క ఎంతగా పురుగులుపడి చచ్చింది? మళ్ళీ సుజాత తనలోకి వెళ్ళిపోయింది. జబర్దస్తీని వారించే వారే లేరే. రంగ డుంటేనా? ఎక్కడెక్కడ నుంటాడు? అబల! అవును ఆడాళ్ళని అబల అని వున్న ధైర్యాన్ని కాస్తాలాగేశారు మగాళ్ళు. అబలగా అమ్మ అవును తనమ్మ 'అమ్మ' పుస్తకంతీసి చూద్దామంటే వెలుతురు సరిగాలేదు. అవును తనమ్మ గురించి జోగులు తాత చెప్పిన సంగతి జ్ఞాపకం రానే వచ్చింది.

తాను పాట్టికే పసిపిల్లగా వుండగా కరణంగారికి పిల్లాడు పుట్టాడు. కాని కరణం భార్య రోగిష్టి. పాలియడానికి అమ్మ వెళ్ళేది వారింటికి. ఓ చీకటి రాత్రి కరణం పిల్లాడికి పాలిచ్చి వస్తుండగా తుమ్మతోపుల్లో అమ్మను — అవును అమ్మను చెరిచేశాడు. పాలిచ్చిన పైటనే లాగేశాడు. అమ్మ మర్నాడుదయం చెర్లో శవమై తేలింది. విచారణ కొచ్చిన పోలీసులు శవ పరీక్ష చెయ్యకుండానే హత్యను. ఆత్మహత్యని తేల్చిపారేశారు. గూడెం గాంధీ బొమ్మ ముందు అమ్మ గొబ్బెమ్మలా పడుంది. జోగుల్తాత కాల్చేశాడు. అర్నెల్ల పసిదాన్ని. శవం రూపురేఖల్ని బట్టి జోగుత్తాత ఊహించాడు. గూడెం వాళ్ళు తిరగబడితే వినేవారులేరు. కరణం బస్తీకి ఉడాయించాడు.

కరణంకూడా లీడరే. నాన్న కాల్పుల్లో చచ్చిన సంగతికి సానుభూతి పలికిన కరణం ఇంత ఘోరం చేస్తాడని జోగుల్తాత వూహించలేదట.

'సంఘంలో హోదా ఈయడానికి

కులం అడ్డొస్తుందేకాని, కోర్కెల్ని తీర్చు కోడానికి ఈ దేశంలో కులం అడ్డురాదే' అని జోగుల్తాత చెప్పిన విషయం నిజమే నని రైల్లోని దురుసుతనాన్ని అంచనా వేసుకుంటూంది. తల్లిపాలు సరిగా నోచు కోని తాను, తల్లడిల్లిన తల్లిని చూడనైనా చూడని తనకు తల్లి జ్ఞాపకార్థంగా వేళ్జిక డమే మిగిలింది. అది వయసొచ్చాక బాగుండదని జోగుల్తాత వారించాడు. నోట్లో వేలేసుకొని తల్లిని తలపుల్లో పల్కరిద్దా మనుకుంటే చుట్టూ జనం చూస్తారని సందేహం—ఈ సమాజాన్ని రంగడెలా మరమ్మత్తు చేస్తాడు తానతనికెలా సాయ పడగలదు?

"చూడమ్మాయ్! నీలో నీవే మాట్లాడు కుంటున్నావ్. విశాఖపట్నం వచ్చేసింది పిచ్చాసుపత్రి వుందిక్కడ—మమ్మలైన్నా దిగనీ" అని ఇందాకటి పక్కావిడ మహిళామండలి కంఠం ఖంగుమంది. మూటా ముల్లా సర్దుకొని సుజాత ప్లాట ఫారం మీదికి దిగగానే "కంట్రీ సరుకు" అని ఒకడు ఛీత్కరించాడు "ఆఫ్రికా గుఱ్ఱం మాంచి సవారీ. డీయంకే పుణ్యాన మద్రాసు రేసులు ఎట్లాగూలేవు. హైద్రా బాద్ జింఖానా రేసుల్తో మొఖం మొత్తింది. జమ్‌కజమా" అని మరొకడు సాహిత్యాన్ని ఆశ్రయించాడు "ఏం గురూ ఇంట్లో జాతి గుఱ్ఱం ఈధిలో అరేబియా గుఱ్ఱం అన్న వరంలో పొట్టి గుఱ్ఱం ఇంకా గుఱ్ఱప్పం దాల మోజుతీరలేదా?" "రౌతులెప్పుడూ


# శ్రీ బాలాజీ వైద్యశాల



## సెక్సు స్పెషలిస్టు డా॥పి. కుమారస్వామి దేవర

మార్వాడి గుడివద్ద; ఫోన్: 551, తెనాలి (ఎ.పి.)

బ్రాంచి: 9-డి, శివాజీ స్ట్రీట్, మద్రాసు-17.

## దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యము

హస్త ప్రయోగం, అతి సంభోగం వలన అంగము చిన్నదై సంభోగ కాలమందు అకస్మాత్తుగా అంగము కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక డోస్‌తో ఎన్నడూ కని విని ఎరుగనంత వీర్య స్తంభన కలిగి హాయి నిచ్చును. అసంతృప్తి చెందు స్త్రీ, పురుషులు వాడతగినది. స్వస్థులు), హెర్నియా (గిలక), కుష్టు, బొల్లి, చర్మవ్యాధులకు పోస్టుద్వారా కూడా నయం చేయబడును. వరిబీజము (బుడ్డ), మూత్రవ్యాధులకు ఆపరేషన్ లేకుండా నయం చేయబడును. స్వయంగా రండి. క్షయ, ఉబ్బసమునకు ఉచితం, రండి.

బ్రాంచీలు:—తిరుపతి, నెల్లూరు, గుంటూర్లలో త్వరలో తెరవబడును.

గుర్రాలు మార్చాలి అప్పుడే యుద్ధాలు గెలుస్తాం" వెంటాడుతూన్న ఈ సాహిత్యాన్ని వింటూనే స్టేషను దాటి వచ్చేసి నేరుగా రిక్షాలో కూర్చొని పోనీమంది? సుజాత. "అదిగో గురజాడబొమ్మ దిగండి"—సుజాత దిగింది. పక్కగా వున్న గుడిశల్ని వెదుక్కుంటూపోయింది. ఇంతలో "హలో లక్ష్మీటాకీస్ సెంటర్" అని పల్కరించాడు ఒక బేవార్సినాయలు. ఇంకా సమాజం గురజాడ దగ్గరే వుందని వూహించుకుంటూండగా "ఏం సుజాతా బాగుండావా? నీ కోసమే చూస్తున్నా. రంగడి ఉత్తరం పెకారం రావల్సింది నేడే కదా!"

"యశోదక్కా నీవు బాగుండావా? అడ్రసు మార్చినట్టున్నావ్!"

"వయసున్నప్పుడే లక్ష్మీ టాకీస్ సెంటర్. అది దాటితే ఈదుల్లో పడాల్సిందే."

ఇప్పుడు తన కర్థమైంది ఆ కుర్రాడు లక్ష్మీటాకీస్ సెంటర్ అని ఎందుకు సంబోధించాడో.వయసుదాటిన వీధి అమ్మాయిలు బతుకంతా కాంది శీకుల్లా గడపాల్సి వస్తూన్న సంగతి యశోద మాటల్ద్వారా గ్రహించి మున్సిపాల్టీ పంపురానందుకు కాలకృత్యాల్ని వాయిదా వేసి కాగితాలు డబ్బు సర్దుకొని బయల్దేరింది సుజాత— బస్సులో దారి పొడుగునా సీతక్క చావు గురించి దాని చెల్లెలు యశోదక్క దుర్భర జీవితంగురించి గురజాడ కథ 'దిద్దుబాటు' గురించి, కరణం గురించి ఆలోచిస్తూ కూచుంది సుజాత—ఉదయం పదింటికల్లా కాలేజీ ఆవరణ చేరి ప్రిన్సిపాల్‌ను కలుసుకుంది. "చూడమ్మాయ్ వెంటనే ఫీజు కట్టు చీటీ తీసుకో. హాస్టల్లో కూడా నీ సీటు వుంది." ప్రిన్సిపాల్ మాటల ప్రకారం ఫీజు కట్టడానికి కాలేజీ కౌంటర్ దగ్గరికి పోయి చిల్లర డబ్బులు రూపాయాలు కలుసున్న మూట అందిచ్చింది— "ఎవరీ చిల్లరకొట్టు చిట్టెమ్మ" అంటూ ఫీజు మూటను అడ్మిషన్ చీటీని చూశాడు ఫీజుక్లర్కు. ఇంటర్‌లో స్టేటు ఫస్టు ఎంట్రన్సులో ఫస్టు. గోల్డ్ మెడల్ సంపాదించిన సుజాత. నాలుక్కరుచుకొని పని చెకచెకా పూర్తి చేశాడు. రసీదు పుచ్చుకున్న సుజాత హాస్టల్ గదిని స్వాధీనపరుచుకుంది. యశోదక్క దగ్గరికెళ్ళి పెట్టా మూటా తెచ్చుకుంది. స్నానం వగైరా కానిచ్చి ఓరియంటేషన్ క్లాస్ హాజరవడానికి హాలుకెళ్ళింది. అప్పటికే కాకిగోలగా వుంది హాలు. సుజాతను చూడగానే భ్రష్ట యువతరం సుళ్లు తిరగడం ఆరంభించింది. కాగితబ్బాణాలు చీత్కారాలు కామెంట్లు కబుర్లు గొల్లుమంటున్నాయి. హాల్లో అడుగు పెట్టగానే "బహుళ పంచమి జ్యోత్స్న భయపెట్టునన్ను" అని కవితా చమత్కారాన్ని విసిరాడో గిరీశం సంతతి. "బహుత్ యారానాలగ్తాహై" అన్నాడొక హిందీ సినిమా షోకీలా—

"చూపులు చూసి, ప్రాణంతీసే ఓలచ్చా గుమ్మడీ" అన్నాడొక బాపు స్ఫురిత శృంగారం వాపుగాడు.

అన్ని దుర్మార్గాలు సహిస్తూ సుజాత సీటు కోసం వెదకి ఓ మూలకెళ్ళికూచుంది హాలులో. ఇంతలో ప్రిన్సిపాలు వచ్చాడు స్టాఫు వచ్చింది. "మనది మెడికల్ కాలేజీ

విజ్ఞానం. శాస్త్ర పరిశోధన ప్రజాసేవ మన లక్ష్యం— ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న ఈ కాలేజీలో చేరిన విద్యార్థులందరూ కాలేజీ ఖ్యాతిని ఇనుమడింప చేస్తారనే నా అచంచల విశ్వాసం. మెడికల్ కాలేజీ సీటు ఈనాడు ఒక స్వప్నం.అది భగ్నంకారాదు" అని మూడు ముక్కల్లో ముగించాడు. ఆ తర్వాత ప్రసంగం ప్రిన్సిపాల్ తన అస్తిత్వానికే ప్రమాదమని గ్రహించి జాగ్రత్తపడ్డాడు. మిగతా లెక్చరర్లు పరిచయం చేసుకున్నారు. వ్యాఖ్యానాల మధ్య గోల గాలివానగా మారుతూంది. ప్రిన్సిపాలు, అధ్యాపక వర్గం రంగం వదిలి వెళ్ళారు—సీనియర్ విద్యార్థులు ఒక్కరొక్కరూ ఒక్కరొక్కర్ని బ్రతిమిలాడి బయటికి తీసుకెళ్తున్నారు. పరుగులు కేకలు పెడబొబ్బలు వినబడుతున్నాయి. దిక్కులేనట్టు మూల నక్కి కూచున్న సుజాతను

"పంచమిగారూ! మీ పేరు తెలవక ఇలా సంబోధిస్తున్నాను — క్షమించండి- మా వాడి కామెంటు నాధారం చేసుకొని అలా పిలిచాను. మీరు బయటికి నడిచి రావాలి" అని ఒక విద్యార్థినాయకుడు ల్యావిష్‌గా అడిగాడు—

"ఎందుకండీ" సుజాత—

"ఏదో లాంఛనం-కాస్త థ్రిల్—"

"నా కిష్టంలేదు."

"నో ఎక్సెప్షన్"

"దేనికి?"

"అదిగో ఆ బయటవున్న వాటర్ పూల్‌లో మునగాలి. ఆ తర్వాత ఓ స్వీటు, ఓ హాటు, ఓ కాఫీ. ఇదిక్కడి ఆచారం. ప్రతి జూనియరూ ఇలా చేయాల్సిందే— మిగతా లేడీ స్టూడెంట్సు అలాగే చేశారు. మీకు తప్పదు."

"నన్ను వదిలేయండి ప్లీజ్."


"చూస్తావేరా ఎత్తుకెళ్ళు" అని మరో కడి అర్డరు.

"ఆగరా! సామ, దాన, భేద, దండో పాయాలు వరసగా వున్నాయి."

"నేనే వస్తానండి." అంటూ సుజాత బైటికి నడిచింది. అప్పటికే నీటిగుంటలో మునిగినవాళ్లు వణుకుతూ టీలు తాగుతున్నారు. తాను చాల కష్టంగా నీట్లోకి దిగి మునిగి తేలింది. బయటికి నడిచింది. ఇంతలో ఎవరో నెట్టారు. మరొకరు పొర్లించారు. మట్టి మట్టయిన నీర జాకెట్టు తను చాల అసహ్యంగా దీనంగా,హీనంగా. చూడబడినందుకు లేచి ఏడుస్తూ నడుస్తూ వుంటే ఎవరో స్వీటు అందించారు.

"యూ అన్‌కల్చర్డ్ రోగ్స్" అని నేలకు కొట్టి పరుగెత్తింది. హాస్టలుచేరి మళ్ళీ స్నానం చేసింది. ఏడుస్తూన్న గదిలో కూచున్న సుజాతను ఎవ్వరూ పలుకరించలేదు. అంతా కబుర్లలో కేరింతల్లో వున్నారు. హాస్టలు ఊడ్చే నూకాలు వచ్చి "ఏంది రేగింగ్ జరిగిందా? దుర్మార్గం ముండాకొడుకులు ఆడ మగా చూడరు. ఇంకా నయంతల్లి. కిందటేడు ఓఅమ్మాయి కోక ఇప్పేశారు. ఈ రోజుల్లా పెమాదమే. ఈళ్ళ నడుపులో పెట్టేవారే లేరు. భాస్కరావు బాబుండేవాడు. ఈ రేగింగ్ తీసెయ్యాలన్నాడు.పాపం! ఫీజుల స్ట్రెయిక్‌లో జైలుపాలయ్యాడు. ఆ బాబు ఆయన స్నేహితులుండగా ఒక్కడూ ఆడపిల్లల్ని

వానొచ్చి వరదలాయె!?




చూసేవాడేరాదు" అని చాల చెప్పింది. అయినా వినే ఓపిక లేదు సుజాతకు. దుఃఖానికి అవమానానికి కుంగిపోతూంది. ఇంతలో రాత్రి కావచ్చింది. భోజనాల గంట వెళ్ళోదసుకుంది—కాని ఆకలితో నిద్రపట్టని అనుభవం వున్నందువల్ల ఎంగిలి పడదామనే నిశ్చయించుకొని వెళ్ళింది—

అమ్మాయిలంతా పగటి దృశ్యాల్ని వర్ణించుకుంటూ తింటున్నారు. "ర్యాగింగ్ ఈజ్ స్వెట్లీ ఏ థ్రిల్!" అని ఒకరంటూండగా సుజాత డైనింగ్ హాలులో ప్రవేశించింది.

"పూర్ గరల్ పెరుబుల్లీ డిస్టర్బ్" అని మరొక హేళనలాంటి సాంత్వన "ఆమెకు జరిగిన నష్టమేమిటే కాకి నల్లబడుతుందా ఏమి? అవునా పంచమీ?" అని మరొక వెక్కిరింత. సుజాత మాట్లాడకుండా ఎంగిలి పడడానికి కూచుంది ఓ మూలలో రేగిన గోలలో—

అందరూ కేరింతల్లో భోంచేస్తున్నారు. ఇంతలో ముస్తాబైన ఓ నాజూకు అమ్మాయి వచ్చి అందరికీ బందరు లడ్డూలు వడ్డించింది. మిమిక్రీ చేసింది. నటుల్ని అనుకరించింది. ద్రౌపదీ వస్త్రాపహరణం ఏకపాత్రాభినయం చేసింది. బ్లౌజిప్పదీసింది. "దుశ్శాసనా వాజ్ నాట్ ఇంట్రెస్టెడ్ ఇన్ బ్లౌజ్" అని ఎవరో వ్యాఖ్యానించారు. "సారీ! ఇదిగో సార్" అని చీర విప్పేసింది. పరికిణీలేదు. "ఛీ స్టుపిడ్—షి నాజ్ నాట్ షి" అని అందరూ ఎంగిలి చేతుల్తో కళ్ళు మూసుకున్నారు. స్ట్రీకింగ్ చేసిన ఓ మగ విద్యార్థి పరుగులు తీశాడు. కొందరింకా నవ్వుతూనే వున్నారు. పరుగు తీసినవాడు మూలలో నక్కిన సుజాత

బుగ్గపై "పంచమీ బీ స్పోర్టివ్!" అని గిల్లి మరీ వెళ్లాడు. పగలబడి నవ్వింది డైనింగ్ హాల్ —వెంటనే లేచి గదివైపు నడిచింది, చేతులు కడుక్కున్న సుజాత. అందరూ గదులవైపు జోకులతో నడుస్తున్నారు. మొదటి గది తెరవగానే ఓ పంది బైట పడింది. హడలిపోయింది లావటమ్మాయి. ఇలా ఇన్ని పశువులూ చివరకు అస్థి పంజరమూ ఆ యా విద్యార్థుల సంకేత ప్రతీకలుగా బయటపడ్డాయి గదులతలుపులు తెరవగానే. మారుమూల గదివైపువెళ్తున్న సుజాత భాగ్యం కోసం అందరూ చూస్తు న్నారు. సుజాత భయం భయంగానే తలుపు తీసింది. "కావుకావు"మంటూ ఐదు కాకులు బయటికి పరుగు తీశాయి— "పంచమీ హాపోయటిక్ ఇటీజ్" అని వ్యాఖ్యానం, నవ్వులు కురిశాయి. ఇంకా కుంగిపోయిన సుజాత గదిలోకి దూరి తలుపు వేసుకుంది. ''మాలగది. సారీ మూలగది" అని ఇదివరకే సంబోధించిన మాటలు 'పంచమి—కాకి' వ్యాఖ్యానాలు సుజాతను మరీ మరీ వేధిస్తున్నాయి. ఈ భ్రష్ట యువలోకం జాతినేం ఉద్ధరిస్తుంది? ఏడుస్తూ ఆలోచనల్లోకి వెళ్ళిపోయింది. 'అమ్మ'పుస్తకం తెరిచింది. కొంత చది వింది. ఆందోళన ఆవేదన అవమానాలు.


**ఆంగ్లేయబోధిని**

చిన్నలు, పెద్దలు ఆంగ్లము రానివారు మా ఆంగ్లేయబోధిని సహాయంతో 30 దినములలో ఆంగ్లము నేర్చుకొనవచ్చును. వెల: రూ. 10/-

**తమిళ-తెలుగు స్వబోధిని**


తమిళభాష రానివారు మా తమిళ-తెలుగు స్వబోధిని సహాయంతో 35 దినములలో తమిళం నేర్చుకొనవచ్చును. వెల: రూ. 3/-

**హిందీ-తెలుగు స్వబోధిని**

హిందీ భాషను అతి సులభముగా అందరు 30 దినములలో హిందీ-తెల్గు స్వబోధినిద్వారా అతి త్వరలో నేర్చుకొనవచ్చును. వెల: రూ. 4/-

పై వాటికి పోస్టేజి అదనము.

బాలసరస్వతీ బుక్ డిపో (ఫోన్: 29868) :: మద్రాసు 600 001




అమ్మ జ్ఞాపకాలు గూడెం దృశ్యాలు మనసును మరీ వికలంచేశాయి.

తనకు ఒంటరిగా ఇచ్చిన మూలగదిని, కట్టుదిట్టంగా పథకం ప్రకారం జరుగుతూన్న అరాచకాన్ని, తనపట్ల జరిగిన అవమానాల్ని, మరీ ముఖ్యంగా తనని నీటి గుంటలో ముంచిన విద్యార్థినాయకుడు తన వూరి కరణంగారి అబ్బాయే అని తెలుసుకున్నాక మరీ ఆవేదన ఎక్కువైంది. సుజాతకు ఎటూ తోచలేదు. ఈ కాకుల మధ్య తన చదువు సాగగలదా? అనే అనుమానం పీడించసాగింది. ఉదయం మట్టిలో పొర్లించిన ఘట్టం ఊరికే జ్ఞాపకం వస్తూ ఏడిపించసాగింది. నాశనమైపోయిన ఆ చీరను బాగుచేసేదెలా? అనే బెంగ. ఉన్న రెండు చీరల్లో ఒకటి చిరిగింది. రంగడు వచ్చేదాకా వాటితో గడపాలి. రంగడు చందాలు పోగుచేసి తన నిక్కడకు పంపాడు—అలాంటి చందాల్తోనే చదువు సాగించమని బలవంతపెడ్తున్నాడు. శకుంతలక్కయ్య ఇచ్చిన చీర చిరిగిపోయింది. పావం శకుంతలక్కయ్య. ప్రేమించిన వాడి కోసం ఇల్లు వాకిలి వదిలి వచ్చేసింది. శకుంతల భర్త రహస్య జీవితంలో వున్నాట్ట—ఈ సమాజాన్ని మారుస్తాడట. శకుంతలక్క ఎంత మంచిది. ఉన్ననాలుగు చీరల్లోనే రెండు చీరలిచ్చింది. తనకు పట్టు బడని ఇంగ్లీషుని నేర్పించి తనని ప్రయోజకురాల్ని చేసింది. ట్యూషన్లు చెబుతూ బతుకుతూ వుంది. వాళ్ళ బాబెంత బాగున్నాడు. చిన్నప్పుడు అందరూ ముద్దొ

స్తారు. నేనూ చిన్నప్పుడు ముద్దొచ్చేదాన్ననుకుంటా. నల్లపిల్లలు కూడా చిన్నప్పుడు ముద్దొస్తారు. అవును జానకమ్మ పిల్ల నల్లదేకదా. ఎంత బాగుంది! నవ్వితే మల్లెలురాల్తాయి. "సుజాతా నవ్వకు చంద్రుడు సిగ్గుపడిపోతాడు" అని రంగడనేవాడు తన నవ్వు గురించి. ఎలా వున్నాడో ఏమో. అస్తమానం సంఘాలు. అలా ఒక వైపు రాత్రనక పగలనక సంఘంకోసం చచ్చి వాళ్ళుంటే ఈ బలిసిన మంద ఇలా అరాచకం చేస్తుందేమిటి? ఇలాంటి అరాచకమే మరో రూపంలో అమ్మను బలితీసుకుంది. అమ్మ అవును అమ్మను నేను చూడలేదు. అనుకోకుండా వేలు నోట్లోకి వెళ్ళింది. ఏదో ఆనందం తృప్తి. స్తన్యం నోచుకోని సుజాత తాదాత్మ్యం.

బాల్య రసాస్వాదన చేస్తూన్న సుజాతను పలకరించడానికి చంద్రుడొచ్చాడు కిటికీగుండా—సుజాతా ఉలిక్కిపడింది. మంచమీద—మంచంమీద పడుకోవడం తెలియని సుజాత తల్లిని తలపోస్తూ దిండును తీసి కిందపడుకోవడానికి ప్రయత్నించేయబోయి కేక పెట్టింది. భయంకరమైన కేక....అప్పటికే కేరింతల హాస్టల్ గాఢనిద్రలో తలుపులు బిగించి కలల్లో గిలిగింతలు పడుతూంది. మారుమూల గది ఆర్తనాదం విసరాలు మర్నాడు పదింటికి కాని బయటపడలేదు.

ఎంతకూ తలుపులు తెరుచుకోక పోయే సరికి, కిటికీనుండి విడ్డూరం చూసినవారు సుజాత గది తలుపులు బద్దలుకొట్టారు. అందులో సుజాత తల తెల్లబడి పూర్తిగా వికారంగా మారిపోయింది. ఓ మూల నక్కి రెండు చేతుల్లోకి. వేరే ఒక కోసేసిన స్తనం ముద్దను తీసుకొని చీకుతూ. నములుతూ తింటూ పిచ్చిగా కనిపించింది.

ఓ పోకిరీగాడు ప్రయోగాలకు వచ్చే స్త్రీ శవం చన్నుకోసుకొని తెచ్చి సుజాత తలదిండు కిందపడేసినట్లు, తల్లి ప్రేమను చూడని సుజాత కోసివున్న స్తనాన్ని చూసి షాక్ తిని, మతిభ్రమించి పిచ్చిదైనట్లు అందువల్లే తలవెంట్రుకలు తెల్లబడి వుంటాయని మెడికల్ బోర్డువారు ప్రథమ విచారణలో తేల్చిపారేశారు. ఆ తర్వాతి సమగ్ర పరిశోధన విశాఖపట్టణం పిచ్చాసుపత్రిలో జరుగుతూంటే సుజాత వేరే తలపుల్లో తేలాడుతూంది. చూడ వచ్చిన జోగులుతాత పగిలి ఏడుస్తూంటే "దిక్కులేని జనం దిక్కుమాలిన బతుకు బతకాల్సిందేనా?" అని నూకాలు యశోదక్కతో ప్రశ్నించింది. రంగడు గుండెపగిలి గుడ్లు నిండి గేటువైపు చూస్తున్నాడు. బయట భాస్కరరావు విడుదలను కోరుతూ అగ్గిబిడ్డల సమ్మె ఊరేగింపు జోరుగా సాగుతూవుంది.

